క్లుప్తంగా

తాగునీటికి తండ్లాట



దంతాలపల్లి: మండలకేంద్రం చివారు గొప్యా తండాలో గిరిజనులు తాగునీటి కోసం తండ్లా డున్నారు. గొప్యాతండాకు తాగునీరు అందించే బోరుబావిలో మోటారు కాలిపోయి 5 రోజులైన పాలకులు పట్టించుకోవడంలేదని శనివారం తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై సర్పంచ్, కార్యదర్శికి చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి తండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.

'108'లో ప్రసవం



డోర్నకల్: మండలంలోని చిలుకొయ్యలపాడుకు చెందిన గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. చిలుకొయ్యలపాడుకు చెందిన కన్నెబోయిన ఉమారాణికి శుక్రవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఈఎన్‌టీ నరేష్, పైలెట్ సైదులు ఉమారాణికి వాహనంలోకి తరలించి ఖమ్మం ఆస్పత్రికి బయలుదేరారు. నొప్పులు పెరగడంతో మార్గమధ్యలో వాహనంలోనే పండంటి బాబుకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు వాహన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

జయప్రదం చేయాలి

దంతాలపల్లి: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలిజేసి చైతన్య పరచడమే లక్ష్యంగా ఈనెల 17న జిల్లా కేంద్రంలో సీపీఐఎం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాచైతన్య యాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్వాల వీరన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బండి శ్రీను, నాయకులు గునుగంటి మోహన్, సీఐటీయూ మండల బాధ్యుడు వెంకన్న, నాగరాజు, దైద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ



నెహ్రూసెంటర్: ఎండాకాలం వేడిమి నుంచి ఉపశమనం కోసం ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని డిపో మేనేజర్ జె.విజయ్ శనివారం తెలిపారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

తొర్రూరు: చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో నేటి నుంచి (ఆదివారం) పట్టణంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు మన్నూరు ఉమ తెలిపారు. 11వ జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలు ఈనెల 16వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, కలెక్టర్ శశాంక, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లు హాజరు కానున్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

డీజిల్‌లో నీళ్లు కలిశాయని ఆందోళన



దంతాలపల్లి: మండల కేంద్రంలో గల ఓ పెట్రోల్ బంక్‌లో పోయించుకున్న డీజిల్‌లో నీళ్లు కలుస్తున్నాయని వాహనదారులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. వివరాలు.. వారం రోజుల క్రితం కందుకూరి సురేష్ మినీ ట్రక్కులో 10లీటర్ల డీజిల్ పోయించుకున్నాడు. కిలోమీటరు దూరం వెళ్లిన అనంతరం వాహనం ఆగింది. మెకానిక్ వద్దకు తీసుకెళ్లగా డీజిల్‌లో నీళ్లు కలిసినట్లు తెలిపాడు. ఇదే విషయమై వాహనదారులు బంకు వద్దకు వెళ్లి బంక్ సిబ్బందిని నిలదీశారు. అధికారులు బంకును పరిశీలించాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు సీఓఈ ప్రవేశ పరీక్ష

కురవి: నేడు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆదివారం సీఓఈ ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ ఇమ్మానియేల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

మహబూబాబాద్: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూసెంటర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కేంద్రం ఈడీ కేసులతో ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదన్నారు. కౌన్సిలర్ మార్నెని శ్రీదేవి మాట్లాడుతూ.. బండి సంజయ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ ఫ్లెక్సీకి నాయకురాళ్లు చెప్పులతో కొట్టి తమ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, మార్నెని వెంకన్న, చిట్యాల జనార్దన్, శంకర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్: నిరసన తెలుపుతున్న నాయకులు



డోర్నకల్: పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాల్సిందే

మరిపెడ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈడీ విచారణలో ఉండగా ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాల్సిందేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని జాతీయ రహదారిపై గల ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ముందు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్‌కు సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: బండి సంజయ్‌ని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ పట్టణ సోషల్ మీడియా అధ్యక్షుడు లావుడ్య రాంబాబు మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఐదు లక్షల మంది హమాలీ కార్మికుల రక్షణకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని దశల వారీగా పోరాటాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ తెలిపారు. సంఘ కార్యాలయంలో కుమ్మరికుంట్ల నాగన్న అధ్యక్షతన ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. ఈసమావేశంలో ఉపేందర్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వాల ఖజానాలు నింపే కార్మికుల సంక్షేమం కోసం పాలకులు ఎలాంటి సంక్షేమ చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఈనెల 15 నుంచి 25 వరకు దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని 25మందితో ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిమోహన్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరికుంట్ల నాగన్న, సహాయ కార్యదర్శులుగా తోట శ్రీనివాస్, సట్టు సత్యం, తోట యాకయ్య కోశాధికారిగా పోతుగంటి మల్లయ్య ఎన్నికయ్యారని తెలిపారు.



మాట్లాడుతున్న కుంట ఉపేందర్

గ్రామదీపికలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గార్ల: రాష్ట్రంలో గత 20 ఏళ్లుగా పొదుపు సంఘాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న గ్రామ దీపికలకు నెలకు రూ.26వేల వేతనం చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం రాష్ట్ర నాయకుడు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత గార్ల పురవీధుల్లో గ్రామదీపికల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామదీపికలకు పనిభారం తగ్గించాలని, బీమా సౌకర్యం కల్పించాలని, విధి నిర్వహనలో మరణించిన వారి కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ దీపికలు మౌనిక, ఉమ, వినోద, రమ, రజిని, చంద్రకళ, స్వప్న, సురేష్, సైదులు, విజయ్‌కుమార్, మంగ్యా, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ దీపికలు

నేడు ప్రమాణ స్వీకారం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వాసవి క్లబ్ 2023 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని వాసవి క్లబ్ అధ్యక్షుడు వేమిశెట్టి వేణుమాధవ్, కార్యదర్శి గెల్లి మురళి, కోశాధికారి బొడ్ల కామేష్ శనివారం తెలిపారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా సోమ రజనీకుమార్, ప్రధాన కార్యదర్శిగా సోమ రాధాకృష్ణ, కోశాధికారిగా పుల్లఖండం ప్రభాకర్ రావు ప్రమాణం చేస్తారన్నారు. వాసవి క్లబ్ అనంతాద్రి లెజెండ్స్ నూతన క్లబ్ ఏర్పాటు కానుందని అధ్యక్షుడిగా వేమిశెట్టి లోకేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా ఇమ్మడి నాగరాహుల్, కోశాధికారిగా జంగాల సోహిత్ కుమార్, వాసవి వనిత క్లబ్ నూతన అధ్యక్షురాలిగా పుష్ప, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం సుష్మ, కోశాధికారిగా స్రవంతి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



లక్ష్మారెడ్డి దంపతులను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

మహబూబాబాద్ అర్బన్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కొత్త లక్ష్మారెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జేవీవీ కన్వీనర్ ఎర్రంరెడ్డి ఉమాదేవి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలు ఉద్యమాల ద్వారా అనేక హక్కులు సాధించుకున్నప్పటికీ, సమాజంలో ఇంకా పురుష ఆధిపత్యం నడుస్తుందన్నారు. అనంతరం మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. లక్ష్మారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రూపాదేవి, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిశెట్టి కిషోర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తడకమల్ల బ్రహ్మం, లింగంపల్లి దయానంద్, కోశాధికారి సాహితీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మైస నాగయ్య, ప్రతాపని మంగపతిరావు, ఉపాధ్యక్షులు లలిత, వాణి, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తాం..



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డిపో మేనేజర్

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తామని మహబూబాబాద్ డిపో మేనేజర్ విజయ్‌కుమార్ తెలిపారు. డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నతో కలిసి డిపో మేనేజర్ శనివారం ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రతీ రోజు ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి ఇక్కడి నుంచి పట్టణంలోకి వస్తాయని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు స్థానికులకు అవకాశం కల్పిస్తామని, బస్టాండ్ సమీపంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్ అభివృద్ధికి మున్సిపాలిటీ పాలకవర్గం సహకరించాలని కోరారు.

పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలి

కురవి: ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కురవిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్సి పరీక్షల సూపరింటెండెంట్ వి.సరిత, డిపార్ట్‌మెంట్ అధికారి కె.సురేష్ తెలిపారు. శనివారం పాఠశాలలో వార్షిక పరీక్షల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి, పీడీ వీర్యానాయక్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అంతర్గత రోడ్లకు మహర్దశ

గార్ల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో గ్రామాల్లో, తండాల్లో అంతర్గత రహదారులకు సీసీ రోడ్ల నిర్మాణంతో మహర్దశ వచ్చిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కోట్యానాయక్‌తండాలో ఎస్‌ఆర్ ఈజీఎస్ నిధులు రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీ ప్రకారం తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారని, తండాల్లో అంతర్గత రహదారుల మరమ్మతుల కోసం సీసీ రోడ్ల నిర్మాణాలు, సైడ్ డ్రైయినేజీ నిర్మాణాలు చేపట్టడంతో తండాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, ఎంపీటీసీ సుగుణాదేవి, కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌నాయక్

ప్రజలను మోసగించిన బీఆర్‌ఎస్

కేసముద్రం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను బీఆర్‌ఎస్ మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మురళీనాయక్ అన్నారు. శనివారం మండలంలోని మహమూద్‌పట్నం, భూక్యారాంతండా, తావుర్యాతండా జీపీలలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు దాటినా ఇచ్చిన హామీల అమలులో విఫలం చెందారని విమర్శించారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, యాకూబ్, రాము, బాబులాల్, సురేష్, శ్రీను, లింగయ్య, తిరుపతి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కురవి బస్టాండ్‌కు సూర్యాపేట బస్సు

సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు శనివారం నుంచి వస్తున్నట్లు మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఎస్‌టీఐ అజీముద్దీన్ తెలిపారు. మహబూబాబాద్ డిపో నుంచి వయా కురవి మీదుగా సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఇక నుంచి ప్రతీ రోజు బస్టాండ్‌కు వచ్చి పోయేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. బస్సుల రాకపోకలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బస్సులను బస్టాండ్‌కు వచ్చేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. చాలా ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో సూర్యాపేటకు వెళ్లే బస్సులు గుడి వద్దకు వచ్చి పోయేవి. నేటి నుంచి ఆ సమస్యకు తెరపడడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ విద్యా విధానంపై సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

నర్సింహులపేట: జాతీయ విద్యా విధానం 2020లో కొఠారి కమిషన్‌లో ఉన్న ప్రగతిశీల అంశాలను తొలిగించి, మత మనువాద అంశాలను జోడించారని, ప్రస్తుతం కొనసాగుతుంది జాతీయ విద్యా విధానం కాదని, జాతీయ వ్యతిరేక విద్యా విధానమని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెద్దనాగారం స్టేజీ కెకెఎస్ గార్డెన్‌లో శనివారం టీపీటీఎఫ్(తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ పెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశంలో కామన్ స్కూల్ కామన్ ఎడ్యుకేషన్ లేనప్పుడు కామన్ ఎంట్రెన్స్‌లు ఎందుకని ప్రశ్నించారు. కొఠారి కమిషన్ ప్రకారం విద్యకు జీడీపీలో 6శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.భోగేశ్వర్, వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుంచు శ్రీ శైలం, పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి మైస శ్రీనువాస్, రాష్ట్ర కౌన్సిలర్ తండా సదానందం, టి.రవీందర్, వెంకన్న, జిల్లా నాయకులు జినుకల వెంకట్రాంనర్సయ్య, రమేష్, ఉప్పలయ్య, ఐలయ్య, శ్రీనువాస్, క్రాంతికుమార్, సైదులురెడ్డి, గుప్తా, శ్రీనువాస్, పాల్గొన్నారు.

విద్యారంగంపై వివక్ష విడనాడాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వం తన అధికారాన్ని తిరిగి కాపాడుకొనే రాజకీయ పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ, సమాజ శాశ్వత నిర్మాణానికి పునాదులు వేసే విద్యారంగం పట్ల వివక్ష చూపిస్తుందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. నర్సింహులపేట మండల పెద్ద నాగరంలో శనివారం నిర్వహించిన టీపీటీఎఫ్ సదస్సుకు జిల్లా కేంద్రం నుంచి టీపీటీఎఫ్ నాయకులు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బలాస్టి రమేష్, ఎస్.విష్ణువర్ధన్, మండల బాధ్యులు ఉపేందర్, విద్యాసాగర్, శ్రీనివాస్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు



హోమగుండం పూజలో పాల్గొన్న భక్తులు

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని శివరామగిరి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం హోమగుండం పూజలు చేశారు. హోమగుండం పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే సీఐ బుర్ర సురేష్, మౌనిక, ఇన్‌చార్జ్ సర్పంచ్ సారయ్య, విజేందర్, వెంకన్న, బ్రహ్మచారి పాల్గొన్నారు.

తాళ్లపూసపల్లి ఆలయంలో..

మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు లక్ష్మణాచార్యులు, గంపా శ్రావణకుమారాచార్యులు, రాజు పాల్గొన్నారు.

విరాళం అందజేత



దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామంలో త్వరలో జరగబోయే మాదిగల కుల దైవం పెద్దమైసమ్మ పండుగ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.50వేల విరాళం అందజేసినట్లు సంఘం సభ్యులు శనివారం తెలిపారు. కోమటిరెడ్డిని కలిసిన వారిలో మహేందర్, వెంకటయ్య, వీరన్న, నగేష్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మహబూబాబాద్: 18వార్డులో పరిధిలోని పలుప్రాంతాలలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతోపాటు జేసీబీతో పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ మాట్లాడుతూ.. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు విద్యుత్ స్తంభాలు, ఖబరస్తాన్‌లో ఉన్న సమస్యలపై మున్సిపల్ అధికారులకు వినతులు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాయి, శ్రీను, మక్బుల్, అనిల్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నీటిని విడుదల చేయాలి

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏరు ఎండిపోవడంతో, ఏటి పరివాహక ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన వరిపంటలు ఎండిపోతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకాల ఏటికి తక్షణమే శ్రీరాంసాగర్ కెనాల్ నీళ్లు విడుదల చేసి ఎండిపోతున్న వరిపంటను కాపాడాలని సంబంధిత జిల్లా అధికారులను డిమాండ్ చేశారు.

అన్నదానంతో భక్తులకు మోక్షప్రాప్తి



మహబూబాబాద్ రూరల్: శ్రీవారి సన్నిధిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదానంతో దాతలకు మోక్షప్రాప్తి లభిస్తుందని శ్రీస్వయంభు వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గద్దె రవి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర బజారులో గల శ్రీస్వయంభు వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో శనివారం భక్తులకు అన్నదాన ప్రసాద పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అలుగువెల్లి వీరభద్రం, కుమార్, జనార్దన్, యాదగిరి, సారయ్య, వెంకన్న, సోమయ్య, రత్నమాచారి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో తోట రవి అనే రైతు తన ఇంటి సమీపంలో పేర్చిన మూడు ఎకరాల గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఇంతలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఘటనలో రూ.30వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎమ్మెల్యే పరామర్శ

కురవి: మండల కేంద్రంలో ఇటీవల కొడవటికంటి చిలకమ్మ మృతి చెందింది. ఈ మేరకు శనివారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, మాజీ ఆలయ చైర్మన్ బాదావత్ రాజునాయక్ పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు అదుపు తప్పిన కారు పొలంలోకి దుసుకెళ్లి పల్టీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడిన సంఘటన మండలంలోని సంధ్య తండా పరిధిలోని ప్రధాన రహదారి పక్కన ఓ రైతు పొలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలంలోని సింగారం తండాలో జరిగిన ఓ వివాహ వేడుక కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మహబూబాబాద్ వెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సంధ్య తండా పరిధిలో వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న వరి పొలంలోకి దూసుకెళ్లిందన్నారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రాణాపాయం నుంచి తప్పించుకుని స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.



వరి పొలంలో పల్టీ కొట్టిన కారు

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



నెల్లికుదురు: గుడుంబా స్థావరం వద్ద అధికారులు

నెల్లికుదురు: తొర్రూర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సంఘటన మండలంలోని శ్రీ రాజ్యతండా, ఆలేరు గ్రామాల పరిధిలో శనివారం జరిగింది. తొర్రూర్ ఎక్సైజ్ సీఐ వి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీ రాజ్యతండా, ఆలేరు పరిధిలో దాడులు నిర్వహించి అక్రమంగా విక్రయిస్తున్న 37లీటర్ల నాటు సారా, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 70కిలోల నల్లబెల్లం సీజ్ చేసి నాలుగు వందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత, ఎక్సైజ్ సిబ్బంది వీరస్వామి, హరిబాబు పాల్గొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం

నర్సింహులపేట: మండలంలోని బొడ్డితండా శివారు అకేరు వాగు ప్రాంతంలో శనివారం గుడుంబా స్థావరాలపై దాడులు చేయగా సుమారు 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై శ్రీనువాసులు తెలిపారు. తయారీదారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీసీలు శ్రీనువాస్, కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలను డోర్నకల్‌కు తరలించాలి



డోర్నకల్: కురవిలో కొనసాగుతున్న మైనారిటీ గురుకుల పాఠశాలను వెంటనే డోర్నకల్‌కు తరలించాలని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో మైనారిటీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయనున్న భవనాన్ని శనివారం చైర్మన్ వీరన్న పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా కురవిలో అద్దె భవనంలో పాఠశాల నిర్వహన కొనసాగుతుండగా ఇటీవల డోర్నకల్‌లో ఓ పాఠశాలను అద్దెకు తీసుకుని విద్యార్థులకు కావాల్సిన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేశారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలను కురవి నుంచి వెంటనే డోర్నకల్‌కు తరలించాలని చైర్మన్ వీరన్న డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పర్వీన్ సుల్తానా, మైనారిటీ నాయకుడు ఎస్‌కే.గౌస్ పాల్గొన్నారు.